సాక్షి
కర్నూలు
మంగళవారం । 12 । మార్చి । 2024



పత్తి క్వింటా రూ.8వేలు

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి క్వింటా ధర రూ.8 వేలు పలికింది. సోమవారం 795 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.



అలరించిన భక్తిరంజని

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై సోమవారం వైఎస్సార్ జిల్లాకు చెందిన వై.జయకృష్ణ, కృష్ణా జిల్లాకు చెందిన గోదా నరసింహారావు బృందం భక్తి రంజని కార్యక్రమాలు అలరించాయి.



'కూలి'పోయిన బతుకులు

తుగ్గలి రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా రైలు ఢీకొనడంతో సోమవారం ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:04
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 5:07
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 5:01
ఆత్మకూరు	సా॥ 6:29	ఉ॥ 5:02
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:02

హదీస్ వెలుగు :

పేదలకు విరివిగా దానధర్మాలు చేయండి. పవిత్ర రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే సాధారణ రోజుల్లో డెబ్బై రూపాయలు చేసినంత పుణ్యం లభిస్తుంది. – పవిత్ర ఖురాన్

మూగవేదన లేకుండా.. ముంగిట్లోకి పశువైద్యం

- పశు సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లతో అత్యవసర సేవలు
- నియోజకవర్గాల వారీగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు
- పశువైద్యం, పశుపోషణపై అవగాహన పెంచుతున్న పశువిజ్ఞానబడులు
- ఆర్‌బీకేల ద్వారా పశువులకు వైద్యం

పశువైద్య సేవల్లో సమూల మార్పులు వచ్చాయి. గతంలో పశువులకు జబ్బు చేస్తే పాడి రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పశువైద్యులు లేక, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లలేక అవస్థలు పడేవారు. కొన్ని సందర్భాల్లో ఎంతో ప్రేమగా పెంచుకున్న మూగజీవాలు మృత్యువాత పడేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పశువైద్య సేవలు రైతుల ముంగిటకే వస్తున్నాయి. ఒక్క ఫోన్‌కాల్‌తో పశువు ఉండే చోటుకే నిపుణులైన వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారు. అంతేకాకుండా గ్రామ గ్రామానా పశు వైద్య సహాయకుల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 66 పశువైద్యశాలలు (వెటర్నరీ డిస్పెన్సరీలు), 11 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, 111 గ్రామీణ పశువైద్యశాలల ద్వారా మూగజీవాలకు వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు 466 రైతుభరోసా కేంద్రాల్లోనూ పశువైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో మొత్తంగా 654 గ్రామాలకు పశువైద్య సేవలు విస్తరించాయి. 108, 104 తరహాలో 1962 సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1962 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే గంట నుంచి రెండు గంటల వ్యవధిలో పశువైద్యాధికారులు వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ క్లీనిక్‌లో వెళ్లి మూగజీవులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

సత్వరం అత్యవసర సేవలు

వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ల ద్వారా మూగజీవాలకు రాష్ట్ర ప్రభుత్వం సత్వర వైద్య సేవలు అందిస్తోంది. రెండేళ్లుగా ఈ సేవలు అందుతున్నాయి. ఆవులు, ఎద్దులు, బర్రెలు, సన్న జీవాలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. వ్యాధులతో బాధ పడుతున్నా.. టోల్‌ఫ్రీ నంబరు 1962 ఫోన్ చేస్తే చాలు... అరగంట నుంచి దూరాన్ని బట్టి రెండు గంటల వ్యవధిలో అంబులెన్స్ వచ్చి వైద్య సేవలు అందిస్తుంది. మొదట నియోజకవర్గానికి ఒకటి ప్రకారం వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా వైద్య సేవలు మెరుగుపడటంతో నియోజకవర్గానికి అదనంగా మరొక అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గంలో ఒకటి, ఇతర నియోజకవర్గాల్లో రెండు ప్రకారం ఇవి సేవలు అందిస్తున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వీటిలో పేడ, రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు సన్న జీవాలు, పెంపుడు జంతువులకు అక్కడికక్కడే శస్త్ర చికిత్సలు చేసే సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితి ఎదురైతే పశువును అదే వాహనంలో పశువైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించి, నయమైన తరువాత ఇంటికి తీసుకొస్తారు. ప్రతి అంబులెన్స్‌లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచారు. మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించిన వెటర్నరీ అసిస్టెంటు సర్జన్, కాంపౌండర్ కమ్ ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్ కమ్ అటెండరు ఉంటారు.



వైఎస్సార్ వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్



పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రతిష్టాత్మకంగా పశు విజ్ఞాన బడులు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఇంట పాడిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. పశుపోషణ, పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, దూడల మరణాలు తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పశుసంవర్ధకశాఖ ఈ ఏడాది నుంచి పశు విజ్ఞానబడి అనే వినూత్నమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రతి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(పశువైద్యుడు), సహాయ సంచాలకులు వారానికి ఒకటి ప్రకారం నెలకు 4 పశు విజ్ఞానబడులను నిర్వహిస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా మూగజీవాలకు వైద్య సేవలు

ప్రతి రైతుభరోసా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల విలువ చేసే పశు మందులను సరఫరా చేస్తోంది. గతంలో ఆర్‌బీకేలకు పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పశుసంవర్ధకశాఖలోని పారాసిబ్బంది, గోపాల మిత్రలను ఆర్‌బీకేలకు ఇన్‌చార్జీలుగా నియమించి వైద్య సేవలు అందించారు. ప్రతి ఆర్‌బీకేల్లో నెలకు సగటున 100–150 పశువులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో ఖాళీగా ఉన్న అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసింది. నియామకాలు కూడా పూర్తయ్యాయి.

పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు

గతంలో ఉమ్మడి జిల్లాకు కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాల ప్రాగంణంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం మాత్రమే ఉండేది. పశువులకు వ్యాధులు సోకినపుడు వ్యాధి నిర్ధారణకు శ్యాంపుల్స్‌ను కర్నూలుకు మాత్రమే పంపాల్సి ఉండింది. దీంతో పశువులకు మెరుగైన వైద్యం అందించడంలో జాప్యం జరిగేది. దీంతో పశువుల్లో మరణాలు కూడా ఎక్కువగానే ఉండేవి. నేడు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా డాక్టర్ వైఎస్ఆర్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో పశువ్యాధులను నిర్ధారించి, వైద్య సేవలు అందిస్తుండటంతో పశు మరణాలు తగ్గాయి.

జిల్లాలో పశుసంపద వివరాలు

తెల్లజాతి పశువులు	3,56,541
నల్లజాతి పశువులు	4,20,882
గొర్రెలు	19,85,868
మేకలు	6,10,669
కోళ్లు	12,89,417

పెయ్య దూడల అభివృద్ధి

మేలు జాతి పెయ్య దూడలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణకు 2022లోనే శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు 3,261 నాటు ఆవులు, నాటుబర్రెలకు కృత్రిమ గర్భధారణ చేశారు. ఇందులో 426 పశువులకు 398 పెయ్య దూడలు పుట్టాయి. లింగనిర్ధారిత వీర్యం ఒక డోసు పూర్తి ధర రూ.1,350 ఉండగా...రాష్ట్ర ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తోంది. రైతులు కేవలం రూ.500 మాత్రమే భరించాల్సి ఉంది. మొదటి డోసులో చూలు కట్టకపోతే రెండోసారి కూడా వేస్తారు. రెండు డోసులకు కలిపి ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. రెండు డోసులు వేసినా చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి చెల్లిస్తారు. నూతనంగా సరోగసీ విధానంలో జాతి పశువులను అభివృద్ధి చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అభివృద్ధి చేసిన పిండాలను ఎంపిక చేసిన ఆవు గర్భంలోకి పంపి మేలైన జాతి దూడలను పుట్టించనున్నారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఎంపికైంది.

సేవలు విస్తరించాయి



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పశు వైద్యసేవలు విస్తరించాయి. మూరుమూల గ్రామాల్లో సైతం పశు వైద్య సేవలు అందుతున్నాయి. 1962 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడమే తరువాయి వెటర్నరీ అంబులేటరీ క్లీనిక్‌లు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాయి. ఆర్‌బీకేల ద్వారా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి వారం పశువిజ్ఞాన బడులు నిర్వహిస్తూ పశువైద్యం, పశుపోషణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ రామచంద్రయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి, కర్నూలు జిల్లా

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ అధికారాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ (డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్) అధికారాలను ఇస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 194 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఉండగా, ఇప్పటి వరకు 129 మందికి డీడీఓ అధికారాలు కల్పించామని పేర్కొన్నారు. పలు సాంకేతిక కారణాలతో మిగిలిన 65 మందికి సాధారణ బదిలీల సమయంలో డీడీఓ అధికారాలు కల్పించినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో జరిగే ఆర్థిక పరమైన అంశాల్లో సర్పంచుతో పాటు గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు భాగస్వామ్యం ఉంటుందన్నారు.

13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 13న (బుధవారం) నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, మధ్యాహ్నం 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య వైద్యంపై ఆయా స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు మహిళాభివృద్ధి–శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక- ప్రణాళిక, పనులకు సంబంధించిన శాఖలపై సమీక్ష కొనసాగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. సంబంధిత స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

క్వింటా వాము రూ.32,011

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము ధర ఆశాజనకంగా ఉంది. రైతులు పండించిన వామును అమ్ముకోవడానికి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు మాత్రమే ఏకైక మార్కెట్. మార్కెట్‌కు వాము 658 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,111, గరిష్ట ధర రూ.32,011, సగటు ధర రూ.18,060 ప్రకారం పలికింది.

- శనగలకు కనిష్ట ధర రూ.2,100, గరిష్ట ధర రూ.5,359, సగటు ధర రూ.5,889 నమోదైంది.
- కర్నూలు మార్కెట్‌కు 1103 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా.. కనిష్ట ధర రూ.999, గరిష్ట ధర రూ.17,011, సగటు ధర రూ.13,199 లభించింది.

ఎన్నికల నియమావళిపై అవగాహన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల నియమావళిపై మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వీరికి వేర్వేరుగా అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై గతంలో రిటర్నింగ్ అధికారులకు మాత్రమే శిక్షణ ఇచ్చేవారమన్నారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీలు వేర్వేరుగా ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి నామినేషన్లను వేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి, మీడియా నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

14న కర్నూలుకు సీఎం జగన్ రాక

- జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి భూమి పూజ చేయనున్న ముఖ్యమంత్రి

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టుపై జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి భూమి పూజ చేసేందుకు ఈనెల 14 న సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. జగన్నాథగట్టుపై న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాట్లను జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. హెలిప్యాడ్, అవసరం ఉన్న ప్రాంతాల్లో బారికేడింగ్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పైలాన్‌కు ఎదురుగా ఉన్న స్థలాన్ని చదును చేసి ముఖ్య అతిథులు ఒకవైపు..1000 మంది కూర్చునేలా విధంగా వేదికను ఏర్పాటు చేయాలన్నారు. వేదికతోపాటు గ్రీన్ రూమ్‌కు కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజుకు సూచించారు. పైలాన్ అందరికీ స్పష్టంగా కనిపించే విధంగా వేదికను ఏర్పాటు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ గుమ్మడి నాగబాబు, డీఎస్పీ విజయ్‌శేఖర్, ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, కల్లూరు తహశీల్దార్ మునివేలు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, జేసీ మౌర్య తదితరులు

నేడు వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవం

- పార్టీ కార్యాలయాల్లో వేడుకలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం పార్టీ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తెలిపారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2011 మార్చి 12న ఆవిర్భవించిందని, 13 ఏళ్ల ప్రస్థానంలో రాష్ట్రంలో బలీయమైన ప్రాంతీయ పార్టీగా ఎదిగిందని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని ఇబ్బందులు సృష్టించినా ప్రజాబలంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీ వల్లే సాధ్యమైందని తెలిపారు. 40 సంవత్సరాల చరిత్ర అని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని 2019 ఎన్నికల్లో కేవలం 23 సీట్లకే పరిమితం చేశారంటే జగనన్నకు ప్రజాబలం ఎంత ఉందో ఇట్టే అర్థమవుతోందన్నారు. 2024లోనూ 2019 ఫలితాలే పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేయడంతో పాటు జెండా ఆవిష్కరించాలని సూచించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు.



బీవై రామయ్య



పోలీస్ బందో'మస్తు'

కేంద్ర బలగాలతో కర్నూలు త్రీటౌన్ సీఐ, ఎస్‌ఐ

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలోని ఫ్యాక్షన్, సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో కలసి కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. మూడు రోజుల క్రితమే కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. కేంద్ర సాయుధ బలగాలతోపాటు పోలీస్ అధికారులు ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తూ ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. సోమవారం కర్నూలు త్రీటౌన్ సీఐ మురళీధర్, ఎస్‌ఐ మన్మథ విజయ్ ఆధ్వర్యంలో త్రీటౌన్ పీఎస్ పరిధిలో సీక్యాంప్, మద్దూర్ నగర్ మసీదు, గాయత్రి ఎస్టేట్, ఎన్‌టీఆర్ సర్కిల్, బుధవారపేట జంక్షన్ వరకు ఫోర్త్ టౌన్ పోలీస్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టీఆర్ బిల్డింగ్స్, ఉల్చాల వై-జంక్షన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ సీఐ శంకరయ్య, ఎస్‌ఐ మోహన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో మద్దికెర, బురుజుల, అగ్రహారం, పెరవలి, బసినేపల్లె, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షణలో మాలపల్లి, లచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. సీఐలు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎలీషా వలి, ఎస్‌ఐలు రమేష్ బాబు, కృష్ణమూర్తి ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

'చెరుకులపాడు' కలను నిజం చేస్తున్నా

- పాలహంద్రీపై రూ.23కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నాం
- నిర్మాణం పూర్తయ్యాక తానే ఎమ్మెల్యేగా ప్రారంభిస్తా
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): తన భర్త, దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి కలను నిజం చేస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి ఆనుకుని ఉన్న పాలహంద్రి నదిపై పురాతన బ్రిడ్జి స్థానంలో రూ.23కోట్లతో హైలెవల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సోమవారం ఆమె భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, జేసీబీతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలహంద్రీ నదిపై లోలెవల్ బ్రిడ్జి ఉన్న ఫలితంగా వరదల సమయంలో వెల్దుర్తి, కృష్ణగిరి, దేవనకొండ, కోడుమూరు మండలాల గ్రామాలకు రాకపోకలు ఆగిపోయేవన్నారు. నది ఆనుకుని ఉన్న గ్రామానికి, ఇళ్లకు, ముందు, వెనుక గ్రామాలకు లోలెవల్ బ్రిడ్జ్ ఫలితంగా వరదల సమయంలో ముప్పు ఏర్పడేదన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.23కోట్ల నిధుల మంజూరు చేశారన్నారు. హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభం కావడం సంతోషమన్నారు. ప్రజల దీవెనలతో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచి పూర్తయిన బ్రిడ్జిని తానే ప్రారంభిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గోకులపాడు బ్రిడ్జి ఇటీవల మంజూరు చేశామని, తన భర్త దివంగత నేత నారాయణరెడ్డి హయాంలో తొగర్చేడు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశామని గుర్తు చేశారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్ బాబు మాట్లాడుతూ.. 550 మీటర్ల పొడవుతో 8మీటర్ల ఎత్తుతో బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. నదిలో 216 మీటర్ల మేర 16 మీటర్ల వెడల్పుతో 13 పిల్లర్లు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, కంగాటి రామ్మోహన్ రెడ్డి, కంగాటి వంశీధర్ రెడ్డి, వైఎస్సార్సీపీ వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల అధ్యక్షులు బొమ్మన రవిరెడ్డి, ఆర్‌బీ వెంకట్రాముడు, వెల్దుర్తి జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ రాములమ్మ, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, మండల కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా, డీఈఈ భారతి, ఏఈఈ రుక్మిణి, చెరుకులపాడు రామకృష్ణ, శివ, మధు, నాగన్న, రంగన్న, ఎర్రమల, సోములు, సత్యాలు పాల్గొన్నారు.



హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి జేసీబీతో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



చెరుకులపాడు గ్రామ సమీపంలో వర్షాకాలంలో మునిగిపోయిన పాలహంద్రీ నది లోలెవల్ బ్రిడ్జి (ఫైల్)

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష విభాగం అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు ఉండగా.. 2017లో చాగలమర్రి, తుగ్గలి కేజీబీవీల్లోను, 2019లో మరో 9 కలిపి మొత్తం 21 కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రారంభించారు. రెండేళ్ల నుంచి మిగతా 33 కేజీబీవీల్లో విద్యార్థినులకు ఇంటర్ విద్య అందుతోంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉండే స్పెషల్ ఆఫీసర్(ప్రిన్సిపాల్స్), సీఆర్టీ, పీజీటీ, పీఈటీ, ఒకేషనల్ పోస్టులు 230 భర్తీ చేశారు. దీంతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఇక్కడ బోధన అందుతోంది. విద్యార్థినులు మంగవారం నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు https//apkgbv. apcfss.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన వారి వివరాలను తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం వారు పంపించనున్నారు.





శ్రీమఠం.. గురువైభవోత్సవం

మంత్రాలయంలో సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలను సోమవారం పవిత్ర దీప ప్రజ్వలన చేసిన ప్రారంభిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు. ఈ ఉత్సవాలు ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మంగళవారం శ్రీ రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా జరపనున్నారు. 16న టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ, ప్రహ్లాదరాయల రథోత్సవం ఉంటుంది. – మంత్రాలయం

క్లుప్తంగా

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమంలో స్వీకరించిన వినతులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పద్మజ తదితరులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన సమస్యలను నాణ్యతతో పరిష్కరించడంతో పాటు ఏ ఒక్క దరఖాస్తు రీఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. పరిష్కారం దొరకని సమస్యలకు సరైన కారణాలను ఎండార్స్ చేస్తూ అర్జీదారులకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో అధికారులకు అప్పగించిన విధులు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేశారని, ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 14 రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన కూడా విజయవంతం చేయాలన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున అధికారులకు కేటాయించిన విధులు తు.చ తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. స్పందనలో 111 వినతులు అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

నిర్లక్ష్యం చేయొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...స్పందన అర్జీలను పరిష్కరించడంలో ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకు రావాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువు దాటిలోపే అర్జీకి పరిష్కారం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని పరిస్థితి ఉంటే తగు కారణాలతో అర్జీదారుడికి వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ డీఎంలో వర్క్‌షాపు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త కిరణ్

కర్నూలు సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీడీఎం)లోని మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం రోబోల కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపును డీఆర్‌డీఓ శాస్త్రవేత్త(పూణే) డాక్టర్ కిరణ్ ఆకెళ్ల, ట్రిపుల్‌ఐటీడీఎం డైరెక్టర్ డీవీఎల్‌ఎన్ సోమయాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోబోల తయారీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఏఐ విభాగంలో పరిశోధనలు చేసే విద్యార్థులకు వారం రోజుల పాటు జరిగే వర్క్‌షాపు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు కార్యక్రమంలో వర్క్‌షాపు కో–ఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ మండవ తదితరులు పాల్గొన్నారు.

కాలిన రోగులకు ఉపశమనం

- ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ఆధునిక హంగులు
- రూ.2.64కోట్లతో భవన నిర్మాణం
- పోస్టులన్నీ భర్తీ చేసిన రాష్ట్రప్రభుత్వం



నూతనంగా నిర్మించిన కాలిన రోగుల విభాగం

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మన శరీరానికి ఏదైనా మంట తగిలితే బొబ్బలు వచ్చి అల్లాడిపోతాం. అలాంటి శరీరంలో 20 నుంచి 90 శాతం కాలిన గాయాలుంటే వారి పరిస్థితి ఎలాగుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారికి చికిత్సతో పాటు ఉపశమనం కలిగించే వసతులు, సౌకర్యాలు కూడా వార్డులో ఉండాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన భవన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసింది. ఇటీవలే ఈ భవనం రోగులకు అందుబాటులోకి వచ్చింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ప్రతి సోమ, గురు వారాల్లో ఓపీ సేవలు ఉంటాయి. ప్రతి ఓపీ రోజున 45 నుంచి 50 మంది, సగటున నెలకు 350 మంది చికిత్స నిమిత్తం రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో అవసరమైన వారికి మంగళ, శుక్రవారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఇలా ఏటా 500 నుంచి 700 వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గతంలో ఈ విభాగానికి ఒక్కరే వైద్యులుండే వారు. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వతంత్ర భారతి, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక ఉన్నారు. వీరితో పాటు పీజీ సీట్లు కూడా అందుబాటులోకి రావడంతో వైద్యసేవలు విస్తరించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో గ్రహణమొర్రి, చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలు, రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ (ప్రమాదాల్లో ఎముకలు విరిగిన తర్వాత అయ్యే గాయాలు), హ్యాండ్ సర్జరీలు(చేతిలో నరాలు, కండరాలు, ఎముకలు తెగిపోయిన సరిచేయడం), కాలిన గాయాలు, మచ్చలు, వైకల్యం, కాస్మోటిక్ సర్జరీలు(ముక్కు, బుగ్గలు, పెదాలు, కంటి రెప్పలు, చెవులపై ఉన్న లోపాలను తొలగించడం),ఫేస్‌లిఫ్ట్ సర్జరీ, స్థనాలు(బ్రెస్ట్) సర్జరీలు, పొట్టజారిపోయిన వారికి చేసే ఆపరేషన్లు, అధిక బరువును తగ్గించే లైపో సక్షన్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

కాలిన గాయాలైన వారికి...

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో కాలిన రోగులకు ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వార్డు కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ సేవలకు, కాలిన రోగులకు విడివిడిగా విభాగాలు ఆసుపత్రిలో ఉన్నాయి. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.6.7కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.64కోట్లను భవనం కోసం ఇచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్లయినా పనులు ప్రారంభించలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోగుల ఇబ్బందులను గుర్తించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ మేరకు ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని లెప్రసి విభాగం పక్కన నూతన భవన నిర్మాణం ఇటీవలే పూర్తి కావడంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. త్వరలో ఈ భవనంలోకి ప్లాస్టిక్ సర్జరీ, కాలిన రోగుల విభాగం మార్పు చేసే అవకాశం ఉంది.

త్వరగా కోలుకునే అవకాశం



ఎన్‌పీపీడీబీఐ కింద కాలిన రోగుల కోసం నూతన భవన నిర్మాణం పూర్తయితే రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ భవనంతో పాటు వసతులు, సౌకర్యాలు మెరుగవడంతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించనున్నారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

–డాక్టర్ మంజులబాయి,
ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

వైద్యులు, వసతులతో ఆధునిక భవనం

ఎన్‌పీపీడీబీఐ ప్రోగ్రామ్ కింద ప్రత్యేకంగా కాలిన రోగుల కోసం నూతన భవనం, మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి. ఈ మేరకు భవనంలో రెండు వెంటిలేటర్లు, నాలుగు వైటల్ పారామీటర్ మానిటర్స్, డెర్మాటోమ్, రెండు స్కిన్ గ్రాఫ్ట్ మెషర్, రెండు పోర్టబుల్ లైట్స్, ఐదు హంబీస్ నైఫ్ మంజూరయ్యాయి. దీంతో పాటు 37 మంది వైద్యులు, సిబ్బంది పోస్టులు కూడా మంజూరయ్యాయి. ఇందులో ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు అనెస్తెటిస్ట్స్, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్స్‌లు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిలిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మాచారి)లు ఉన్నారు. తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయితే త్వరలో ఇది కాలిన రోగులకు రెఫరల్ సెంటర్‌గా మారనుంది.

వనిత డిపాజిట్ స్కీమ్ గడువు పొడిగింపు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల ప్రారంభించిన వనితా డిపాజిట్ స్కీమ్ గడువు పొడిగిస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. సోమవారం డీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి అధ్యక్షతన బోర్డు సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వనిత డిపాజిట్ స్కీమ్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని, గడువు కూడా ఈ నెల 11తో ముగిసిన నేపథ్యంలో ఈ నెల చివరి వరకు పొడిగించాలని నిర్ణయించామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగిరెడ్డి నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. పత్తికొండ, ఆదోని, ఆలూరు, కృష్ణానగర్, డోన్ బ్రాంచీల్లో పెండింగ్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని రాబట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, మూలింటి రాఘవేంద్ర, డీసీసీబీ సీఈవో విజయకుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ డీజీఎం అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలు





పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, పండితులు, రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మహానందీశ్వరుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, నాగేశ్వరశర్మ, తదితర రుత్వికుల బృందం ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. యాగఫల సమర్పణ, మహానందీశుడి దంపతులకు కంకణ, చండీశ్వరుడు, త్రిశూలుడికి త్రిశూల స్నానం పూజలను స్థానిక రుద్రగుండం కోనేరులో వైభవంగా చేపట్టారు. పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వారి దంపతులతో పాటు మహానందీశ్వరుడి దంపతులను ప్రదక్షిణ గావించి తిరిగి అలంకార మండపానికి చేర్చారు.మహానందీశుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజ పటాన్ని ఆరోహణ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆ పటాన్ని అవరోహణం చేశారు. అనంతరం స్థానిక అలంకార మండపం వద్ద నాకబలి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో కల్యాణోత్సవ దాత లక్కబోయిన ప్రసాద్, ఏఈఓలు ఓంకారం వెంకటేశ్వరుడు, ఎర్రమల మధు, రిటైర్డ్ సూపరింటెండెంట్ కొండయ్య, కేశవరెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రంగన్న ,నాగభూషణం, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహానందిలో ధ్వజ అవరోహణ చేస్తున్న దృశ్యం

నేటి నుంచి యథావిధిగా ఆర్జితసేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిలిచిన మహానందీశ్వరస్వామి ఆర్జిత సేవలు, గర్భాలయ ప్రవేశాన్ని మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతాయని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు ఆరు రోజుల పాటు ఆర్జితసేవలు నిలిపిన విషయం తెలిసిందే.

పట్టాలపై 'కూలి'పోయిన బతుకులు

- ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా ఢీకొట్టిన డెమో రైలు
- ఇద్దరు కూలీల మృత్యువాత



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంతకల్లు రైల్వే సీఐ బీవీ నగేష్‌బాబు



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

తుగ్గలి: వారిద్దరూ రెక్కల కష్టం చేసుకుని బతికే వారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారు. ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా రైలు వచ్చి ఢీకొనడంతో మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కటుంబాల్లో విషాదం అలుముకుంది. ఈ దుర్ఘటన సోమవారం తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని రాంపల్లికి చెందిన 15 మంది కూలీలు ఎప్పటిలాగే రైల్వే పనుల నిమిత్తం తుగ్గలికి వచ్చారు. స్టేషన్ సమీపంలో ట్రాక్ దిమ్మెలకు ఉన్న ఇనుప రింగులు కనబడేలా అక్కడక్కడ కొంత మంది కంకర తీసేపనిలో నిమగ్నమయ్యారు. గుజ్జుల కిష్టన్న(65), ఏకాశి ఓబులేసు(40), మరో కూలీ ఓచోట కంకర తొలగిస్తున్నారు. అదే సమయంలో డోన్ వైపు నుంచి గుంతకల్లు వైపు ఓ లైన్‌లో గూడ్స్‌రైలు వెళుతోంది. మరో వైపు గుంతకల్లు నుంచి డోన్ వైపు డెమో రైలు వస్తోంది. ఒకేసారి గూడ్స్ , డెమో రైళ్లు వచ్చాయి. ఈ సమయంలో హారన్ వినిపించినా కూలీలు పక్క ట్రాక్‌పై వెళుతున్న గూడ్స్ రైలు దని పొరపాటుపడ్డారు. పనిచేస్తుండగా కంకర దుమ్ము కూడా రేగడంతో కిష్టన్న, ఓబులేసు డెమో రైలు రాకను గమనించలేకపోయారు. ఇంతలోనే రైలు ఇద్దరిని ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరో కూలీ కొప్పు కాశీనాథ్‌కు తీవ్ర గ్రాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. పనిచేసేచోట కూలీలను అప్రమత్తం చేసేవారు కానీ, కనీస రక్షణ ప్రమాణాలు గాని పాటించకపోవడంతోనే దుర్ఘటన జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటన స్థలంలో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కిష్టన్నకు కుమార్తె, కుమారుడు, ఓబులేసుకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు రైల్వే సీఐ బీవీ నగేష్‌బాబు, ఎస్‌ఐలు రాందాస్, వెంకటేశ్వర్లు, సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





మృతులు కిష్టన్న, ఓబులేసు (ఫైల్)

పదవీ కాలం పొడిగింపు

కర్నూలు కల్చరల్: ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్ పదవీ కాలాన్ని మూడు సంవత్సరాలు పొడిగించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ట్రిబ్యునల్ దేవదాయ శాఖకు సంబంధించిన ఆస్తులు, భూముల కేసులను విచారిస్తుంది.

ప్రాణం తీసిన అతివేగం

- స్కూటర్లు ఢీకొని యువకుడి మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన సిద్దీక్ అఫ్రిది

ఆలూరు రూరల్: అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది. రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మహమ్మద్ సిద్దీక్ అఫ్రిది (26) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామం వద్ద 167 హైవేలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం హోస్పేట పట్టణానికి చెందిన మహమ్మద్ సిద్దీక్ అఫ్రిది (26) స్కూటర్‌పై ఆదోనివైపువె వెళ్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన మల్లికార్జున, షఫి అనే ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై ఆలూరు వైపు వస్తున్నారు. మనేకుర్తి గ్రామం వద్ద అతివేగంగా రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ప్రమాదంలో సిద్దీక్ అఫ్రిది అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లికార్జున, షఫిలను అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రశేఖర్ విలేకరులకు తెలిపారు.

పండుగలా 'చేయూత' సంబరాలు

- మండలాల్లో నిర్వహించే కార్యక్రమాలకు పోటెత్తుతున్న మహిళలు
- ఇప్పటి వరకు ఎనిమిది మండలాల్లో వేడుకలు పూర్తి
- 14లోపు చేయూత సంబరాలు పూర్తి చేసేందుకు కార్యాచరణ



చేయూత వేడులకు హాజరైన మహిళలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): 'వైఎస్‌ఆర్ చేయూత' సంబరాలు పండుగలా జరుగుతున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి సి.బెళగల్, ఓర్వకల్లు, కల్లూరు, కోడుమూరులో సంబరాలు ముగిశాయి. సోమవారం కర్నూలు రూరల్, పత్తికొండ, గోనెగండ్ల, నందవరం మండలాల్లో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ నెల 14లోపు మిగిలిన అన్ని మండలాల్లో చేయూత సంబరాలు నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. 45 నుంచి 60 ఏళ్ల లోపు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 18,750 చొప్పున ఇస్తోంది. నాలుగో ఏడాది 1,27,626 మంది మహిళలకు రూ.239.30 కోట్ల లబ్ధి చేకూరింది.

విశేష స్పందన..

గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మహిళల జీవనోపాధులను అభివృద్ధి చేసేందుకు పెద్దపీట వేస్తోంది. జిల్లాలో డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా పొదుపు మహిళలకు ఐదేళ్లలో రూ.1,748.49 కోట్ల లబ్ధి చేకూరింది. పొదుపు సంఘాల్లో 3.50 లక్షల మంది మహిళలు ఉండగా ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక తోడ్పాటుతో నేడు 80 శాతం మంది మహిళలు వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు గృహిణులుగా, వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళలు నేడు వ్యాపారులుగా, పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. మహిళలు సంఘటితమై సొంత పెట్టుబడితో చేయూత మహిళ మార్ట్‌లు నడుపుతున్నారు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుండటంతో వైఎస్సార్ చేయూత సంబరాలకు విశేష స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 8 మండలాల్లో సంబరాలు నిర్వహించగా.. అన్ని చోట్లా మహిళలు పోటెత్తారు. మా నమ్మకం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటూ నినదించారు. ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి హర్షం వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షించారు.

టీడీపీ హయాంలో అంతా మోసమే!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు లక్షాధికారులయ్యారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. నాడు చంద్రబాబు డ్వాక్రా రుణాల మాఫీ హామీని అమలు చేయకుండా చేతులెత్తేస్తే సీఎం వైఎస్ జగన్ రూ.568 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మాఫీ చేసి మహిళలను రుణవిముక్తులను చేశారు. వైఎస్‌ఆర్ చేయూత పథకం ద్వారానే ఒకొక్క మహిళలకు రూ.75 వేల లబ్ధి చేకూరింది. వైఎస్‌ఆర్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ రుణాలు, కల్యాణమస్తు, షాదీతోఫా.. ఇలా అనేక పథకాలు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాయి. టీడీపీ హయాంలో మహిళల సంక్షేమానికి ఒక్క పథకం కూడా లేకపోవడం గమనార్హం. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణ మాఫీ అంటూ మోసం చేసిన చంద్రబాబును మహిళలు నమ్మే పరిస్థితుల్లో లేరు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిస్టమ్ ద్వారా ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు తెలిపారు. పంచలింగాల గ్రామంలో ఉన్న జిల్లా కారాగారాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించారు. ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. వంట గదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజనాల సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్ మనోహర్, జిల్లా సూపరింటెండెంట్ ఘనే నాయక్, జిల్లా ప్రొబేషన్ అధికారి వైఎల్‌ఎన్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన సురేష్ మద్యం సేవించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఆకతాయిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. మరో కేసులో పట్టణానికి చెందిన షేక్‌వాజిద్ జగజ్జననీ టర్నింగ్ ఏరియాలో దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు జైలుశిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.